వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 11 డిసెంబర్ 2022

## జీతాలు, పింఛన్ల చెల్లింపు జాప్యంపై శ్వేత పత్రం విడుదల చేయాలి

### - తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి



**కడప వైద్య విభాగం, డిసెంబరు 10, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు చెల్లింపులో జాప్యంపై శ్వేత పత్రం విడుదల చేయాలని తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తేదీ వచ్చినా ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు చెల్లించకపోవడం దారుణమన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 3 నుంచి 6 నెలల వేతనాలు చెల్లించాలని పంచాయతీల్లో విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. వైసీపీ సర్పంచ్‌లే ఆందోళనకు దిగడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. తుఫాను హెచ్చరికలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సరైన ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ వ్యాప్తంగా తుఫాను కారణంగా పంటలు పాడయ్యే పరిస్థితి ఏర్పడిందని రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### జాతీయ రహదారిలో పొంగ మంచుతో

## పొంచి ఉన్న ప్రమాదాలు

### - జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసు అధికారులు

**ఓబులవారిపల్లె, డిసెంబరు 10, ప్రభాతవార్త:**

కడప - చెన్నై ప్రధాన జాతీయ రహదారి పుల్లంపేట నుంచి శెట్టిగుంట, రేణిగుంట వరకు దట్టమైన పొగ మంచుతో రహదారి నిండిపోయి ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లైట్లే వేసుకొని వాహనాలు నడుపుతున్నా కారు చీకట్లు కమ్ముకున్నట్లు పొగ మంచు రహదారిని కప్పివేయడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కు మంటూ వాహనాలు నడుపుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. వాహన డ్రైవర్లు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని రైల్వేకోడూరు సీఐ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. అన్ని విధాలా వాహనదారులు లైట్లు వేసుకొని ట్రాఫిక్ నియమ నిబంధనలు హారన్ మోగిస్తూ డ్రైవింగ్ చేస్తే కొంత వరకు ప్రమాదాలు అరికట్టవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంటిమిట్టలో విషాదం



ఒంటిమిట్ట మండలం దవంతరంపల్లెలో ఇల్లు కూలి మరణించిన కొమ్ము పద్మావతి

### దవంతరంపల్లె, సాలాబాదులో ముగ్గురు దుర్మరణం

### రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వందలాది ఎకరాల్లో పంట నష్టం

### పొంగి ప్రవహించిన గుంజన, పుల్లంగేరు, ముస్టేరు

### అరటితోటలను పరిశీలించిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



సాలాబాదు దళితవాడలో నీటికుంటలో పడి మరణించిన శ్రావ్య, హర్ష, పొంగి ప్రవహిస్తున్న గుంజననది, ఆకేపాడులో దెబ్బతిన్న అరటితోట

**రాజంపేట అర్బన్/ఒంటిమిట్ట, డిసెంబరు 10 ప్రభాతవార్త**

మాండూస్ తుఫాను తాకిడికి రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వందలాది ఎకరాల్లో అరటి బొప్పాయ తోటలు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు, ఈదురుగాలులతో ఉద్యాన పంటలు నేలకూలాయి. ఒంటిమిట్ట మండలం దవంతరంపల్లె ఎస్‌టి కాలనిలో ఇల్లు కూలి పద్మావతి(43) అనే మహిళ దుర్మరణం చెందింది. రాత్రంతా కురిసిన ఎడతెరపిలేని వర్షంతో ఇల్లు కూలడంతో మృతిచెందింది. వెంటనే సంఘటన స్థలాన్ని తహశిల్దారు జిల్లా కలెక్టర్ విజయరామరాజు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం అంత్య క్రియల కోసం పద్మావతి కుటుంబానికి 10 వేలు సాయం అందించాలని ఆదేశించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు అందజేశారు. మరోవైపు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పద్మావతి కుటుంబానికి ఎంఆర్‌కెఆర్ నిర్మాణ సంస్థ తరపున ఎంపిపి గడ్డం జనార్దన్‌రెడ్డి 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఇదే మండలంలోని సాలాబాదు దళితవాడలో లెట్రిన్ కోసం తవ్విన గుంతలో పడి ఒకే కుటుంబానికి చెందిన శ్రావ్య(6), హర్ష(5) ఇద్దరు చిన్నారులు దుర్మరణం చెందారు. కుంటలో పడిన వెంటనే ఇద్దరు చిన్నారులను కుటుంబ సభ్యులు వెలికి తీసి 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అప్పటికే వారు మృతిచెందినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దీంతో సాలాబాదు దళితవాడలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరివల్ల కాలేదు. చిన్నారుల మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు తీవ్రంగా రోధించారు. మరోవైపు పెన్నానది పరివాహక ప్రాంతాల్లో పంటలు నీట మునిగినట్లు సమాచారం. రాజంపేట మండలంలో ఆకేపాడు, పోలి, పరిసర గ్రామాల్లో అరటి పంట దెబ్బతింది. వెంటనే విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పంటలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గిరీషాకు ఫోన్‌చేసి ఉద్యానవన పంటలకు జరిగిన నష్టాన్ని వివరించారు. వర్షం తగ్గిన వెంటనే గ్రామ స్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేయిస్తామని కలెక్టర్ ఎమ్మెల్యేకి తెలియజేశారు. ఇదిలా ఉండగా రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో జరిగిన ఆస్తి, పంటనష్టం, రోడ్లు, ట్రాన్స్‌కోశాఖలకు 76 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఆర్‌డిఓ కోదండరామిరెడ్డి 'వార్త'కు తెలిపారు. మాండూస్ తుఫాను ప్రభావంతో జరిగిన నష్టం నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. మరోవైపు రైల్వేకోడూరులో అత్యధికంగా 19 సెం.మి, రాజంపేటలో 10 సెం.మి. వర్షపాతం నమోదు అయినట్లు తహశిల్దారు రామ్మోహన్, ఎంవి సుబ్రమణ్యంరెడ్డిలు తెలిపారు. భారీ వర్షాలతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో గుంజన, పుల్లంగేరు, ముస్టేరులు పొంగి ప్రవహించాయి.



పోలిలో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మార్కెట్‌కమిటి వైస్ ఛైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి తదితరులు, మూగవారిపల్లె వద్ద గుంజనేరు ప్రవాహంతో నిలిచిపోయిన రాకపోకలు

# మదనపల్లెలో ముంచేత్తిన మాండూస్ తుఫాన్

### నేలకొరిగిన పంటపొలాలు-భారీగా పంట నష్టం - రోజంతా వర్షంతో ఇబ్బందులు పడ్డ ప్రజలు

### ముంపు ప్రాంతాల్లో రెడ్అలర్ట్ ప్రకటించిన అధికారులు



తుఫాన్‌తో నేలకొరిగిన మొక్కజొన్న పంట, వర్షంతో దెబ్బతిన్న రోడ్లు, ప్రమాదపు అంచున చెరువు

**మదనపల్లె, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**

మాండూస్ తుఫాన్ వర్షం మదనపల్లె డివిజన్‌ను ముంచెత్తింది. రోజంతా నిరవధికంగా వర్షం పడడంతో పంట పొలాలు నేలకొరిగాయి. డివిజన్ పరిధిలో భారీగా పంటనష్టం వాటిల్లింది. వృక్షాలు, చెట్లు ఎక్కడపడితే అక్కడ కూలాయి. వర్షంతో రహదారులు కూడా భారీగా దెబ్బతిన్నాయి. రోజంతా నిరవధికంగా వర్షం పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముంపు ప్రాంతాల్లో ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తుగా అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆర్డీఓ ఎం ఎస్ మురళి ఆధ్వర్యంలో వివిధశాఖల అధికారులు మాండూస్ తుఫాన్ పట్ల అప్రమత్తమై ముందస్తు జాగ్రత్తలు తీసుకొన్నారు. ఏదిఏమైనా శుక్రవారం నుంచి శనివారం రాత్రి వరకు రెండు రోజులు పాటు ఎడతెరపులేని వర్షం పడడం వల్ల ప్రజానీకం స్థంభించిపోయింది. చలి, ఈదురుగాలులతో కూడిన వర్షం పడడం వల్ల వృద్ధులు, పిల్లలు చలితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మాండూస్ తుఫాన్ ప్రభావం వల్ల వెలుగు ప్రత్యేక పాఠశాలలోని వృద్ధాశ్రంలో రుక్కమ్మల్(70)అనే వృద్ధురాలు మృతి చెందింది. వర్షం వల్ల పశువులు, గొర్రెలు మేతకోసం ఇబ్బందులు పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా నిరవధికంగా రెండు రోజులు పాటు వర్షం పడడం వల్ల అనేక రకాలుగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డివిజన్ పరిధిలోని పలుప్రాంతాల్లో వర్షం వల్ల రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. వాహనదారులు కూడా గుంతల రోడ్లతో ఇబ్బందులు పడ్డారు. కురవంక, బాహుదా, బుగ్గకాలువ ముంపు ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇదే వర్షం కొనసాగితే చెరువులు మొరవులు పోయి ప్రమాదవ అంచున చేరే ప్రమాదం ఉందని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో పడ్డ వర్షాలకే డివిజన్ పరిధిలోని చెరువులన్నీ నిండిపోయాయి. ప్రస్తుతం పడుతున్న మాండూస్ తుఫాన్ వర్షం వల్ల చెరువులు దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. తుఫాన్‌తో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రజలు అధికారులు ఏర్పాటు చేసిన కంట్రోల్ కేంద్రాలకు ఫిర్యాదు చేయవచ్చునని అధికారులు చెబుతున్నారు. మదనపల్లె ఆర్డీఓ కార్యాలయం, మున్సిపల్‌కార్యాలయం, మండల పరిషత్‌కార్యాలయల్లో మాండూస్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ట్రాన్స్‌కో అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.

# వరద బాధితులకు భరోసా : ఎమ్మెల్యే



తెగిపోయిన గుండాలేరు, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు మండలంలోని గంగరాజుపోడు, రామయ్యపాళెం ఎస్‌టి గ్రామాలకు బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం రైల్వేకోడూరు మండలంలోని గంగరాజుపోడు, రామయ్యపాళెం ఎస్‌టి గ్రామాల్లో తెగిపోయిన వాగులు, వంకలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. ఇప్పటికే రైల్వేకోడూరు మండలంలోని పలు ప్రాంతాల్లో అధికారులతో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ముమ్మరంగా ప్రయత్నాలు చేసి రాష్ట్రంలోని విపత్తుల ఉన్నతాధికారుల విజ్ఞప్తి మేరకు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా గ్రామీణ ప్రాంతాల్లో వరద బాధితులకు అనుకూలంగా ప్రత్యేక ఏర్పాట్లను చేశామని ఆయన పేర్కొన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని నది పరివాహక ప్రాంతాల్లో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పర్యటించి బాధితులకు న్యాయం కలిగేవిధంగా ఏర్పాటు కార్యక్రమాలను నిర్వహించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి, తోట శివసాయి, తహశిల్దారు రామ్మోహన్, ఎంపిడిఓ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# మండూన్ తుపాను పట్ల భయాందోళన అవసరం లేదు

### ముందస్తు సహాయక చర్యలపై దృష్టి సారించిన జిల్లా యంత్రాంగం

### రిజర్వాయర్లు, చెరువుల నీటిమట్టంపై నిరంతర పర్యవేక్షణ

### రెవెన్యూ డివిజన్ల వారీగా కంట్రోల్ రూముల ఏర్పాటు

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయరామరాజు



**కడప, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**

జిల్లాలో మండూస్ తుఫాను నేపథ్యంలో.. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీ య సంఘటనలకు తావు లేకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలంటూ రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టంపై.. ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. మండూస్ తుఫాను ప్రభావంతో శుక్రవారం నుండి జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపత్యంలో జిల్లాలో పరిస్థితిపై శనివారం రాత్రి కలెక్టర్ విజయ్ రామరాజు సంబందిత శాఖల అధికారులతో.. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎక్కడైనా అత్యవసర సహాయక చర్యలు అవసరమైతే అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా జిల్లాలో అన్ని నదులు, రిజర్వాయర్లలో నీటి మట్టం పెరగడం, నదుల్లో వరదనీరు పెరిగే అవకాశాలు ఉండడంతో.. అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రిజర్వాయర్లు, చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలో చెరువులకు గండ్లు పడ కుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నిరంతర నిఘా ఉంచాలన్నారు. నదులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంటే ముందు జాగ్రత్తగా.. తీరప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పరిస్థితులను బట్టి లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు.. అవసరమైన సహాయక చర్యలను సిద్ధం చేసుకోవాలన్నారు.

**ప్రజలకు ఎలాంటి భయాందోళన అవసరం లేదు**

మండూస్ తుఫాను కారణంగా జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవద్దని.. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అన్ని రకాలుగా సహాయక చర్యలు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ విజయ్ రామరాజు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా.. వర్షం కారణంగా ప్రమాద పరిస్థితులు లేవని తెలిపారు. ఇప్పటికే.. అధికారులు జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారన్నారు. ఒంటిమిట్ట, గోపవరం మండలాల్లో.. జరిగిన రెండు సంఘటనలకు సంబంధించి బాధిత కుటుంబాలను అధికారులు వెంటనే పరామర్శించి తక్షణ సాయం కూడా అందించారన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని, తాత్కాలిక పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే.. సహాయక చర్యల కోసం ప్రత్యేక రక్షణ సిబ్బంది, రెస్క్యూ టీము, ఫైర్ సిబ్బంది, బోట్లను సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. జనరేటర్లు, మంచినీటి ప్యాకెట్లు, ఆహార ప్యాకెట్లు సిద్ధం చేసేందుకు అవసరమైన నిత్యావసర సరుకులను కూడా.. సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.ముందస్తుగా.. వైద్య సహాయక శిబిరాలను, అత్యవసర మందులను సిద్ధంగా ఉంచామని, అన్ని గ్రామ, పట్టణ ప్రాంతాల్లో.. పారిశుధ్యం లోపించకుండా.. చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. తాగునీరు కలుషితం కాకుండా సంబందిత అధికారులు చర్యలు చేపట్టామన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రజారోగ్య భద్రతపై దృష్టి సారించామన్నారు. పంచాయతీ సెక్రెటరీలు, విఆర్వోలు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారన్నారు. పోలీసు, రెవెన్యూ, ఫైర్, విపత్తుల నిర్వహణ, రెస్క్యూ టీమ్ సిబ్బంది సమన్వయంతో.. ముందుకెళ్లాలన్నారు. ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల్లో నీటిమట్టంపై సమాచారం అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ, ఇరిగేషన్ జిల్లా అధికారులు, ప్రాజెక్టు ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లపై పర్యవేక్షణ కరువు

### -నిల్వచేసిన మాంసంతోనే వంటకాలు -కంపు కొడుతున్న వంటగదులు



**రాయచోటి.డిసెంబర్ 10 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంతో పాటు మిగిలిన మండల కేంద్రాలలో హోటళ్లు, రెస్టారెంట్లు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. ఫ్రిడ్జ్‌లలో నిలువ చేసిన మాంసంతో పాటు రకరకాలయిన వంటలకు అవసరమైన సరుకులను నిల్వ ఉంచుతున్నారు. నిల్వ చేసిన వాటితో వంటకాలు చేస్తూ నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు పూర్తిగా కొరబడ్డాయి. కంపు కొడుతున్న వంట గదులు, రెస్టారెంట్లు, హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్‌లు వంటగదులు పరిశుభ్రత లేక కంపు కొడుతున్నాయి. వంట గదిలో నాణ్యత శుభ్రత పాటించడం లేదు. మున్సిపల్ అధికారులు కాని, ఫుడ్ సేఫ్టీ అధికారులుకాని కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏదైనా పిర్యాదు రాగానే తూతూ మంత్రంగా తనిఖీలు పేరుతో అప్పుడప్పుడు ఫుడ్ సేఫ్టీ అధికారులు చుట్టం చూపులా వచ్చి వెళ్తూ శాంపిల్ సేకరణతో సరిపెట్టుకుంటూ చేతులు దులుపుకుంటున్నారు. రాయచోటి చుట్టు ఉండే జాతీయ రహదారిపై ఉన్న డాబాలు హోటళ్లు, ఫుట్ పాత్‌పై తినుబండారాల వ్యాపారాలు తమకు నచ్చిన విధంగా ప్రవర్తిస్తూ ప్రజల ఆరోగ్యానికి ఎసురు తెస్తున్నారు.

**చాల చోట్ల కనిపించని నాణ్యతా ప్రమాణాలు :**

మటన్ చికెన్ అమ్మకం సమయంలో జీవాలు ఆరోగ్యవంతంగా ఉన్నాయా లేదా అని పశుసంవర్ధక శాఖ వైద్యులు పరిశీలించిన తర్వాతనే అమ్మకాలు జరపాలి. కానీ పలువురు అవేమి పట్టించుకోకుండా ధనార్జన ధ్యేయంగా ప్రజల ఆరోగ్యాలతో ఆట్లాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజు మరిగించిన నూనె చల్లార్చిన తర్వాత తిరిగి వాడరాదని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వాహకులు తీరుతో ఆరోగ్యం దెబ్బతింటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాయచోటి పట్టణం మరియు పరిసరాల మండాలల్లో దాదాపు 150 హోటళ్లు ఉన్నాయి. అలాగే బేకరీలు, అద్దె భవనాలలో నిర్వహించే టిఫెన్ సెంటరుల చాలా ఉన్నాయి. ఇందులో నిర్వాహకులు ఎక్కడా పరిశుభ్రత నాణ్యతా ప్రమాణాలు పాటించకుండానే తినుబండారాలు అమ్మకాలు జరుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**నిల్వ చేసిన మాంసంతోనే వంటకాలు :**

రోజువారి వంటకాలకు సరిపడిన మటన్, చికెన్ ఇతర ఆహారపదార్థాలు డీఫ్రిడ్జ్‌లో నిలువ చేస్తూ మరుసటి రోజు అమ్మకాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయన రంగులు కలుపుతూ క్యాన్సర్, గుండె జబ్బులు వంటి ప్రాణాంతకమయిన రోగాలకు కారణం అవుతున్నారు. యజమానులు లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారం నడిపిస్తున్నారు. మరికొందరు మాసం అమ్మకదారుల నుంచి బేరం కుదుర్చుకుని నిలువ ఉంచిన మాంసాన్ని తక్కువ ధరకు తీసుకొచ్చి వంటకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదైనా హోటళ్లలో పాచి పట్టిన తినుబండారాలను గురించి ఎవరైనా ప్రశ్నించినప్పుడు మాత్రమే మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి అపరాధరుసుముతో వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన సమయంలో ఎక్కడా కూడా తనిఖీలు చేసిన దాఖలాలు అయితే కనబడడం లేదు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో వ్యాపారస్తులు తమకు నచ్చినట్లుగా చేస్తున్నారనే వాదనలు లేకపోలేదు.

**అద్వానంగా శానిటేషన్ :**

శుభ్రత విషయంలో హోటళ్లు, రెస్టారెంట్‌లలో పరిస్థితి అద్వానంగా ఉంది. టేబుల్‌లను క్లీన్ చేసే సమయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్లేట్లు, గ్లాస్‌లను రెండు బకెట్‌లలో ముంచేసి శుభ్రం పేరుతో పని కానిచ్చేస్తున్నారు. పరిశుభ్రతపై అనేక హోటళ్లలో చిన్నపాటి ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి అధికారులు తనిఖీలలో ఇవన్నీ కనిపిస్తున్నా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలలో అనేకసార్లు పట్టుబడినా ఇప్పటివరకు చర్యలు తీసుకున్నదే లేదు. చాలా హోటళ్ల వంకాలు సక్రమంగా లేకపోవడం పలుమార్లు కస్టమర్లు ఎదురు తిరిగిన సంఘటనలు కూడా అనేక ఉన్నాయి. కొన్ని చోట్ల ఇష్టం వచ్చిన రేట్లను నిర్ధారించి తీసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసిన తనిఖీలు చేపడితే ఆయా తీనుబండారాల కేంద్రాలలో ఉన్న అద్వానమైన శానిటేషన్ పరిస్థితులు బట్టబయలు అవుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



దువ్వూరు, డిసెంబరు 10, ప్రభాతవార్త:

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మైదు కూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చల్ల బసాయపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామం లో పర్యటించి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎవరికి ఎంత లబ్ధి చేకూరిందో వారి వివ రాలు చదివి వివరించారు. ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథ కాలు ప్రవేశపెట్టిందని అవి సక్రమంగా అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చల్లబసాయపల్లె గ్రామ పంచాయతీకి అం దిన వివరాలను తెలిపారు. అమ్మఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, పింఛన్లు గురించి వివరించారు. ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందు తున్నాయని తిరిగి సీఎంగా జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తవుతుంది



జమ్మలమడుగు, డిసెంబరు 10, ప్రభాతవార్త:

జమ్మలమడుగు మండలం కన్య తీర్థం, సున్నపురాల్లపల్లె గ్రామాల్లో సీఎం జగన్ శంకుస్థాపన చేసిన ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తవు తాయని ఏపీ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) ఛైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మీ, చంద్రమౌళీలు అన్నారు. ఈ సందర్భంగా వారు ఫోన్ ద్వారా విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ ఫ్యాక్టరీకి భూములు ఇచ్చిన వారికి డబ్బులు చెల్లించడం జరిగిందని, ఫ్యాక్టరీ నిర్మాణ కోసం అఖిలపక్ష నాయకులు పరుగులు, పాదయాత్రలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ రాష్ట్రంలో మళ్లీ 175 స్థానాలు సాధించి మళ్లీ జగన్ సీఎం కావడం తథ్యమన్నారు.

## మానసిక వికలాంగులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ




జమ్మలమడుగు, డిసెంబరు 10, ప్రభాతవార్త:

బైబిల్ ఓపెన్ యూనివర్స్ ఇండియా ఇంటర్నేషనల్ జాయింట్ డైరెక్టర్ కింగ్ జాన్సన్ విక్టర్ ఆధరణ సభ సందర్భంగా ఆల్ ఇండియా టు క్రిస్టియన్ కౌన్సిల్ ట్రస్ట్ కడప జిల్లా ఉమెన్స్ కమిటీ అధ్యక్షు రాలు విజయలక్ష్మీ ఆధ్వర్యంలో జ్యోతి మనోవికాస కేంద్రంలోని మానసిక వికలాంగులకు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. బైబిల్ కాలేజీ ప్రిన్సిపల్ రాజేంద్ర మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రేమ మా ఆత్మీయ తండ్రి పీడీ సుందర్‌రావు స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేశామన్నారు. కార్యక్రమంలో ఉమెన్స్ కమిటీ సభ్యులు మేరీ, రమ్యకృష్ణ, సుమతి, కావేరి, జ్యోతి, మనోవికాస కేంద్ర ఫౌండర్ చంద్రమోహన్, పాల్ సుధాకర్ పాల్గొన్నారు.

## ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై పాదయాత్ర



జమ్మలమడుగు, డిసెంబరు 10, ప్రభాతవార్త:

ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై శనివారం పాదయాత్రలో భాగంగా ఉదయం ఎస్వీ ఫంక్షన్ హాలులో కమ్యూనిస్టు సోదరులకు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి పాల్గొని అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీ సాధించే వరకు ఉద్యమం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

## 15న జాబ్‌మేళా

వేంపల్లె, డిసెంబరు 8, ప్రభాతవార్త :

వేంపల్లెలోని కందుల ఓబుళరెడ్డి ఛారిటీస్ ఐటీఐలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రసాదరావు తెలిపారు. బెంగళూరులోని ఇనోదయ ఏజన్సీ 20 కంపెనీలతో సమన్వయం చేసుకుని ఆయా కంపెనీలకు వివిధ పోస్టు లకు అభ్యర్థులను ఎంపిక చేసుకోవడానికి ఈనెల 15న వేంపల్లెకు వస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

పీలేరు, డిసెంబరు 10 ప్రభాతవార్తః

ఆదివారం పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఉదయం ఎంఎం ఫంక్షన్ హాలునందు వైకాపా నాయకులు మూరే చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె చేతన రెడ్డి వివాహంకు హాజరవుతారు. అనంతరం పట్టణంలోని తితిదే కళ్యాణమండపం నందు వేపులబైలు మల్లికార్జునరెడ్డి కుమారుడు భరత్‌రెడ్డి నిశ్చితార్థం కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే ఎస్‌వీఎస్ఎస్ కళ్యాణంలో శ్రీరాములు కుమారుడుకళ్యాణ్ మరియు ప్రశాంత్ వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాబు తెలిపారు.

## సెమీ క్రిస్మస్ వేడుకలు



జమ్మలమడుగు, డిసెంబరు 10, ప్రభాతవార్త:

జమ్మలమడుగు జాన్స్ హైస్కూలు నందు జీసస్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బుల్ శీనుకు పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ అగస్టీన్ రాజు, సెక్రటరీ ప్రభుదానం, సైమన్, సంతోష్ బాబు పలువురు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 50 మంది పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థినిలు

### వార్తకు స్పందన



కమలాపురం, డిసెంబరు 10, ప్రభాతవార్త:

బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థినిలు ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో డిసెంబరు 9న గండిలో జరిగిన షూటింగ్ బాల్, అండర్-19 విభాగంలో 6 మంది విద్యార్థినిలు ప్రగతి, శ్రీవాణి, రెడ్డి వైష్ణవి, పూజిత, సంధ్య, సుష్మితలు ఎంపిక కాగా టార్గెట్ బాల్ విభాగంలో 7 మంది విద్యార్థినిలు ఎంపిక కావడం గర్వకారణమని ప్రిన్సిపల్ తులసమ్మ తెలిపారు. ప్రిన్సిపల్‌తో పాటు పీఈటీ చంద్రకాంతమ్మ, ఝాన్సి లక్ష్మీ, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## డా.ఎన్.విజయబాబుకు సమాజ సేవ పురస్కారం



కమలాపురం, డిసెంబరు 10, ప్రభాతవార్త:

ప్రపంచ మానవ హక్కుల దినో త్సవం సందర్భంగా గోపుల్ మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు గ్రామ వ్యవ స్థాపకులు జాతీయ ఛైర్మన్ కాసల కోనయ్య ఆధ్వర్యంలో కడప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలోని ఆడిటోరియంలో ముఖ్య అతిథులు జాతీయ గౌరవ సలహాదారుడు కె.వి.ఎల్.ఎన్.రామచంద్ర మూర్తి, ఏపీ స్టేట్ ఛైర్మన్, తెలంగాణ పర్యవేక్షకుడు పత్తిపాటి సురేష్‌కుమార్, సౌత్ ఇండియా సెక్రటరీ లక్ష్మయ్య, రిటైర్డ్ జడ్జీ హైదరాబాదు కొమరయ్య, నేషనల్ జనరల్ సెక్రటరీ నాయినీ నరసిం హారెడ్డి, కేఎస్ఆర్ఎం ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి, కడప జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య, సర్వశిక్ష అభియాన్ పీడీ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ సుకుమార్‌కు సమాజ సేవా పురస్కారం అందజేశారు.

## విశ్రాంత ఉద్యోగులపై చిన్నచూపు తగదు



కమలాపురం, డిసెంబరు 10, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులపై ప్రభు త్వానికి చిన్నచూపు తగదని తెదేపా జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాషా అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఉద్యోగులకు 10వ తేదీ వచ్చినా ఇంత వరకు వేతనాలు అందకపోవడం దారుణమన్నారు. కమలాపురం మండలంలో సుమారు వెయ్యి మందికి పైగా రకరకాల ఉద్యోగాల్లో ప్రజలకు సేవ చేస్తూ రిటైర్ అయి వృద్ధాప్యంలో విశ్రాంతి తీసుకుంటున్న ఉద్యోగులకు జీతాలురాక మం దులు, బాడుగలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారన్నారు. వరుసగా 2వ శని వారం, ఆదివారం సెలవులు కావడంతో ఇక సోమవారమన్నా వస్తుందా అని ఉద్యోగులు, పింఛను దారులు ఆశాగా ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులకు, పింఛనుదారులకు 1వ తేదీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## తుపానుపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సి.ఐ. వెంకటేశ్వర్లు



బద్వేలు అర్బన్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :

తుపానుపట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని సిఐ పలుసూచనలు, అత్య వసర సమయంలో బద్వేలు రెవిన్యూ డివిజనల్ కార్యలయం టోల్ ఫ్రీ నెంబరు 9182160052ను సంప్రదించగలరు. కడప జిల్లాలో భారీ వర్షాల సూచన నేపద్యంలో సి.ఐ. వెంకటేశ్వర్లు సూచనలు చూస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంటూ ఏసమంలోనై తమకు తెలియజేయాని టోల్ ఫ్రీ నెంబరును కూడా ఇచ్చామన్నారు. కడప జిల్లాలోని బద్వేలు మునిసిపాలిటి ప్రాంతంలో అర్భన్ పోలీ సులు అప్రమత్తం చేసిన బద్వేలు సిఐ వెంకటేశ్వర్లు, వాగులు , వంకల వద్ద పటిష్ట మైన బందోబస్తు తో వుండాలని బద్వేలు అర్భన్ పోలీసులకు ఆదేశాలు.

## 12న ఎస్ఈబి స్టేషన్‌లో వాహనాల వేలం

మదనపల్లెక్రైం, డిసెంబర్ 10 ప్రభాతవార్త:

పట్టణంలోని వివిధ ప్రోహిబిషన్ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు ఈనెల 12న ఎస్ఈబి పోలీసులు వేలం నిర్వహించనున్నట్లు సిఐ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 12న ఉదయం 9గంటలకు స్టేషన్‌లో డిపాజిట్ చెల్లంచి వేలం పాటలో పాల్గొనవచ్చునన్నారు. హెచ్చుపాటదారునికి తప్ప మిగతా వారికి వేలం ముగిసిన వెంటనే డిపాజిట్ రుసుం వాపసు ఇవ్వబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎస్ఈబి స్టేషన్ నందు పొందవచ్చునని సిఐ తెలిపారు.

## వేతనాలు సకాలంలో చెల్లించండి

### కావేటి రమేష్ యాదవ్




బద్వేలు, అర్బన్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :

రాష్ట్రప్రభుత్వం ఉద్యోగఉపాధ్యాయ, పెన్షనర్ల జీతభత్యాలు చెల్లించకపోవడం అన్యాయమని వైయస్ఆర్ కడపజిల్లా వ్యాయామఉపాధ్యాయ సంఘం మాజీ అధ్య క్షుడు, రాష్ట్ర కౌన్సిలర్ రమేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్‌జిఓ హోమ్ నందు వివిధ మండలాల ముఖ్యనాయకులతో నిర్వహిం చిన పత్రికా సమావేశములో మాట్లాడుతూ ప్రభుత్వము సంక్షేమపథకాల పేరు తో నిధులు దారిమరల్చి, ఉద్యోగఉపాధ్యాయ పెన్షనర్లకు ఒకటోవ తేదీన జమా చేయాల్సిన వేతనాలను పదవతేదీయైనా చెల్లించకపోవడంశోచనీయమన్నారు. రాష్ట్రబడ్జెట్ లో ప్రభుత్వపాలనలో భాగమైన ఉద్యోగఉపాధ్యాయులవేతనాలు పోగా మిగిన నిధులను సంక్షేమానికి వాడాలన్నారు. కోట్లకు పడగలెత్తిన ప్రజాప్రతినిధుల వేతనాలు ఠంచనుగా ఒకటో తేదీ బ్యాంకు అకౌంట్లలో చేరిపోతున్నాయి. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నగదు అందుతోంది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని స్థాయికి చేరడం ఒక దుం దృష్టకర సంఘటన. అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు చివరి పని దినం రోజున వారికి రావలసిన సమస్త ప్రయోజనాలను అందజేసి, చివరకు పెన్షన్ పేపర్లు సైతం చేతిలో పెట్టి సాదరంగా ఇంటికి పంపే ఆనవాయితీ ఉండేది. అదొక మర్యాద. అది అనాడున్న రాజనీతి. ఆనాడు పాలకులకు ఉద్యోగులపై వున్న గౌరవం. ఉద్యోగులను ఆంతగా ఆదరించారో చెప్పనలివి కాదన్నారు. ఇప్పుడు జీతాల కోసం ఎదురు చూసేందుకు జీవితం సరిపోతుందన్నారు. కార్యక్రమములో జిల్లా సీనియర్ ఉపాధ్యక్షులు సగిలి.బాలయ్య,ప్రభాకర్ మైదుకూ రు బాధ్యులు వెంకటరమణయ్య, పోరుమామిళ్ళ బాధ్యులు జిలానీబాష, గోపాల్, గోపవరంమండల బాధ్యులు సుబ్బారావు, అట్లూరు మండలబాధ్యులు కొండయ్య, సిద్దవటం మండల బాధ్యులు నాగేశ్వరరావు,పీరాన్ సాహెబ్, మల్లికార్జునలు పాల్గొన్నారు.

## పంటలపై తుఫాన్ ప్రభావం

దువ్వూరు, డిసెంబరు 10, ప్రభాతవార్త:

మండలంలో మాండోస్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో వివిధ పంటలపై తుఫాన్ ప్రభావం పడిందని చెప్పవచ్చు. వరి, కేపీ ఉల్లి పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. వరి పంట కోత దశలో ఉండడంతో వర్షాలు రావడంతో నేలబారి కిందపడి పోతుందని దీంతో వరి ధాన్యం మొలకెత్తే అవకాశం ఉంది. కేపీ ఉల్లి పంట ఈ వర్షాలతో తెగుళ్ల అధికమై దిగుబడి రాదని రైతులు వాపోతున్నారు. మినుము, మొక్కజొన్న పంటలకు కూడా తెగుళ్ల ఉంటాయన్నారు. ఏది ఏమైనా మాండోస్ తుఫాన్ మండలంలో సాగు చేసిన పంటలకు నష్టం కలిగిస్తోందని చెప్పవచ్చు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కమలాపురం విద్యార్థినిలు



కమలాపురం, డిసెంబరు 10, ప్రభాతవార్త:

రేణిగుంట జిల్లా పరిషత్ హైస్కూల్ లో జరిగిన రాష్ట్ర స్థాయి గట్క ఆటల పోటీలలో ప్రతిభ చూపిన గురుకుల విద్యార్థినిలు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అండర్-14 విభాగంలో నందిని, వర్షిత, అండర్-19 విభా గంలో ప్రగతి, సంధ్యలు ఎంపిక కాగా కర్లింగ్ ఆటలో దీక్షిత, శివాని, పూజిత, అమ్ములు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని, ప్రతిభ కనబరిచిన విద్యార్థిను లను ప్రిన్సిపల్ జి.తులసమ్మ, పీఈటీ చంద్రకళావతి, ఝాన్సి లక్ష్మి, ఉపా ధ్యాయ, సిబ్బంది అభినందించారు.

## కల్వరీ మినిస్ట్రీస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

జమ్మలమడుగు, డిసెంబరు 10, ప్రభాతవార్త:

విని కల్వరీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దైవజనులకు దుస్తులు, బియ్యం పంపిణీ చేసి ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ తరించాలని విని కల్వరి మిని స్ట్రీస్ సెక్రటరీ జి.జె.సైమన్ తెలిపారు. శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలలో భాగంగా ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీసస్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అగస్టిన్ రాజు పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో ప్రజలను నడిపిస్తూ సేవ చేస్తున్నారని సేవకులను అభినందించారు. ఈ మేరకు విని కల్వరీ మినిస్ట్రీస్ సౌజన్యంతో దాదాపు 30 మంది పేద దైవ జనులకు బట్టలు, బియ్యం బస్తా, కానుకలు అందజేయడం ఎంతో సంతోషించ దగ్గ విషయమన్నారు.

## 15న జాబ్‌మేళా

వేంపల్లె, డిసెంబరు 10, ప్రభాతవార్త :

వేంపల్లెలోని కందుల ఓబుళరెడ్డి ఛారిటీస్ ఐటీఐలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రసాదరావు తెలిపారు. బెంగళూరులోని ఇనోదయ ఏజన్సీ 20 కంపెనీలతో సమన్వయం చేసుకుని ఆయా కంపెనీలకు వివిధ పోస్టు లకు అభ్యర్థులను ఎంపిక చేసుకోవడానికి ఈనెల 15న వేంపల్లెకు వస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

## హిందూ ముస్లీం ఐక్యతా దినోత్సవం జయప్రదం చేయాలి

### - ఆవాజ్ జిల్లా అధ్యక్షులు చాన్ బాష

బద్వేలు రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :

డిసెంబరు 19న హిందూ ముస్లీం ఐక్యత దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు చాన్ బాషా అన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ 1927 డిసెంబరు 19న బ్రిటీషర్లచే ఉరితీయబడ్డ అమ రవీరులు స్వతంత్ర సమరయోధులు, విప్లవకారులు అష్ఫఖుల్లాఖాన్, పండిత రాంప్రసాద్ బిస్మిల్‌ల మధ్య చాలా పోలికలు ఉన్నాయని, వీరివురి స్నేహ భావం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జన్మించిన వారిరువురూ ఒకే పాఠశాలలో విద్యనభ్యసించడమే కాకుండా విప్లవ భావాలు అలవడ్డాయని, ఒకే విప్లవయోధ్యమ సంస్థలో సభ్యులుగా చేరి బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలలో ఇరువురూ చురుగ్గా పాల్గొని ఆంగ్లేయులను కలవరపెట్టిన కాకోరి రైలు దోపిడీ సంఘాలలో ఇరువురూ ప్రధాన పాత్ర పోషించారన్నారు. , ఇటువంటి యోధుడు డిసెంబరు 19న ఉరిశిక్ష అమలు చేశారన్నారు. వీరిరువురూ హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రతీ కగా నిలిచారని కొనియాడారు. అందు వల్లనే డిసెంబరు 19న హిందూ, ముస్లీం ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అమరవీరుల త్యాగాలను ఒక్క మారు గుర్తు చేసుకునేందుకే సభ ఉంటుందని, ఈ సభను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఎస్. ఏ.సత్తార్, ఆవాజ్ కమిటీ నాయకులు అన్వర్ బాష, ఆవాజ్ డివిజన్ కార్యదర్శి మస్తాన్, ఉపాధ్యక్షులు దావూద్ వల్లి, ఎస్.ఏ.రహీం, ఆవాజ్ నాయకులు రసూ ల్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

## ఉదోగుల జీతాలను మరిచారా !

### ధర్నాలో ప్రభుత్వాన్ని నిలదీసిన యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు



బద్వేలు, అర్బన్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :

ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్లకు ఒకటవ తేదీన చెల్లించాల్సిన జీతభత్యాలను మరిచారా అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ నిలదీశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసి స్తూ శనివారం ఉదయం బద్వేల్ లోని స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాల యం వద్ద జోరు వానలో హోరు నినాదాలతో "గొడుగులు" ధరించి వినూత్న నిర సన చేపట్టారు. ఈ సందర్భంగా మాదన విజయ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒకటవ తేదీ చెల్లించాల్సిన వేతనాలను 10వ తేదీ దాటినా చెల్లించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. దినసరి ఖర్చులతో పాటు ఇంటి అద్దెలు, నిత్యవసర సరుకులు, బ్యాంకు రుణాల కంతులు చెల్లించలేక సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రాధాన్యతలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉండాలనే విషయాన్ని మంత్రి మరచి నట్టున్నారని ఆయన ఎద్దేవ చేశారు ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోకపోతే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.శశిధర్ కుమార్, బద్వేలు మండల అధ్యక్షులు టి.శివ ప్రసాద్, ట్రెజరర్ ఎ.గుర్రయ్య, గోపవరం మం డల ప్రధాన కార్యదర్శి సి.కంచిరెడ్డి, ట్రెజరర్ యం.రామచంద్రయ్య, ప్రధానోపాధ్యా యుల సంఘం నాయకులు ఏ.వి.రమణయ్య యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పాలా శ్రీనివాసరెడ్డి, పబ్బతి చక్రపాణి, పి.చంద్రశేఖర్ యాదవ్, ఎస్.దేవానందం, ఎస్.చెన్నయ్య, గౌస్ బాషా, ఎస్.మస్తాన్ వలి, నాయకులు యం.శివకుమార్, టి.వి. సుబ్బారావు, పి.ఆర్థర్, శ్రీనివాసులు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసు నమోదు



చిన్నమండెం.డిసెంబర్ 10 ప్రభాతవార్త

మండలంలోని పడమటి కోస గ్రామం బోడిరెడ్డిగారిపల్లికు చెందిన పాలగిరి సత్యనారాయణరాజు అను వ్యక్తి 2వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని బంధువులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలలోకి వెళితే సత్యనారాయణ రాజు తిరుపతి అయితే అతను ఆరోగ్య పరిస్థితి ఇటీవల అతని కుమార్తె ఊరు అయిన బోడిరెడ్డిగారిపల్లికి వచ్చాడు. 2వ తేదీ చిన్నమండెంలోని బ్యాంక్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతని కోసం అన్ని ప్రాంతాలలో వెతికించారు. కాని సమాచారం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. వారి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

## రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు గాలివీడు విద్యార్థులు



గాలివీడు.డిసెంబర్ 10

ప్రభాతవార్త


రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు గాలివీడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు బి.రెడ్డెన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి డైట్ కళాశాల వేదికగా జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జస్వంత్ (త్రీడి), కుమార్‌నాయుడు (జానపదగేయం), శ్రీహరి (తబల) విభాగాలలో మొదటి మూడు స్థానాలలో నిలిచారన్నారు. విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం గర్వకారణమంటూ హర్షం వ్యక్తం చేశారు. వీరు ఈనెల 12న విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలలో పాల్గొంటారన్నారు.

## భారీ వర్షం అప్రమత్తమైన అధికారులు

గోపవరం, డిసెంబర్ 10 ప్రభాతవార్త;

మండలంలో శనివారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన ఎడతెరిపిలేని బారీ వర్షం కురుస్తూనే ఉంది,కొన్ని గ్రామాల రాక పోకలు కూడా ఇబ్బందిగానే మారింది.అయితే మండల అదికారులు అప్రమత్తం అయ్యారు.పైర్లు ఏర్పాటు చేసుకొన్న రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.ఎక్కడా ఎటు వంటి నష్టం జరగకుండా తాహశీల్దారు జీవన్ చంద్రశేఖర్,తోపాటు ఎంఎస్ఓ ఎం,నాగరాజు,ఎంపిడిఓ హరినారాయణలు అప్రమత్తమై ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధమైయ్యారు.బొడ్డేచర్లకు వెళ్లే దారి దగ్గర ఉన్న కల్వర్టు దెబ్బతినింది,అందుకు అవసరమైన ప్రత్యామ్యాయ ఏర్పాట్లు అదికారులు చేసారు.అదే విదంగా ప్రజలకు అవసరమైన ముదస్తు జాగ్రత్తలు తెలిపి అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పూజలు



గోపవరం,డిసెంబర్ 10 ప్రభాతవార్త;

మండలంలో వల్లెరవారిపల్లెకు సమీపాన వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి మార్గశిర మాస మూడవ శనివారం వైభవంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు.కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమానికి పరి సర గ్రామాలనుంచి అదిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్ద ప్రసాదాలను స్వీకరించారు. వీడియో కాల్ ద్వారా సుదూర ప్రాంతాలనుంచి రాజకియ నాయకులు,సినీ ప్రముఖులు, స్వామి కార్యక్రమాన్ని దర్శించుకొన్నారు.ఆలయ పూజారి శ్రీ పెంచలయ్య స్వామి భక్తి శ్రద్దలతో కార్యక్రమాన్ని నిర్వహించారు.చీడ పీడలలాంటి మరెన్నో ఇబ్బందులకు గురైన అభాగ్యులు శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కన్నుల పండుగదా వీక్షించి తరీస్తున్నారు.ప్రతి వారం క్రమం తప్పకుండా ప్రత్యేక పూజలో ఈ దేవదేవుని దర్శించుకోవడం భక్తులకు వరంగా మారింది.కాగా ధర్మ శెట్టి ఆదిలక్ష్మి కుమారులు వెంకటసుబ్బయ్య,అశోక్,రమణ,వెంకటేష్‌లు పూజాకార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందచేసారు.కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు నాయకులు పాల్గొన్నారు,

## 31న హజరత్ ఖాదర్‌వల్లి 131వ ఉరుసు మహోత్సవం



పోస్టర్‌లు విడుదల చేస్తున్న దర్గా సభ్యులు

నందలూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త

నందలూరు మండలం లోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతి పరిధిలో ఉన్న అరవపలె రైల్వే ప్రాంగణంలో ఉన్న హజరత్ ఖాదర్‌వల్లి 131వ ఉరుసు మహోత్సవ ఆహ్వాన పత్రికను దర్గా కమిటి సభ్యులు ఛైర్మన్ కమాల్‌బాషా, వైస్ ఛైర్మన్ షమివుల్లాఖాన్, ట్రెజరర్ సయ్యద్ అమీర్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతోవైభవంగా జరిగే ఉరుసు మహోత్సవం రోజున జరిగే కార్యక్రమాల గురించి రాబోవు ముఖ్య అతిథుల గురించి గంధం, ఉరుసు తేదీలను ఖరారు చేస్తూ ఈ ఆహ్వాన పత్రికను ఆమోదం తెలపడం జరిగిందని వారు అన్నారు. అరవపల్లె నందు హిందూ ముస్లిం సోదరులు కలిసి కట్టుగా సోదరభావంతో జరుపుకొనే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. డిసెంబరు 31న గంధం, జనవరి 1న ఉరుసు కార్య క్రమం ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు నడివీధి సుధాకర్, కలిముల్లాఖాన్, తుమ్మల శ్రీధర్‌గౌడ్, వెంకటేశ్, మణి తదితరులు పాల్గొన్నారు.

## యసానుల్లా కుటుంబాన్ని పరామర్శించిన కిషోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, డిసెంబర్ 10 ప్రభాతవార్త :



మండలంలోని కలికిరి పంచాయితీకి చెందిన లేపాక్షి యసానుల్లా కుటుం బాన్ని శనివారం టిడిపి ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. యసానుల్లా కుమారుడు హిమాయతుల్లా (51) గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకొన్న కిషోర్‌కుమార్‌రెడ్డి యసానుల్లా ఇంటికి వెళ్ళి మృతునికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తాను అండగా ఉంటానని భరసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నిజాముద్దీన్, మైనార్టీ సీనియర్ నాయకులు ముస్తిఫా హాజరత్, టిడిపి నాయకులు వాటర్‌సెడ్ రవి, నాయకులు రమేష్‌శెట్టి, మైనార్టీ నాయకులు అప్రోజ్ బాషా, మండల టిడిపి యువ నాయకులు సనావుల్లా పాల్గొన్నారు.

## మేడికుర్తిలో ముమ్మరంగా అభివృద్ధి పనులు

కలికిరి, డిసెంబర్ 10 ప్రభాతవార్త :



మండలంలోని మేడికుర్తి పంచాయతీలో స్థానిక సర్పంచ్ నాగవేణి కార్యదర్శి రమేష్‌బాబులు అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తున్నారు. మేడికుర్తినుంచి ఆషాది వారిపల్లె దళితవాడ వరకు రోడ్డుపైకి వచ్చిన ముళ్ళపొదలతో స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో జంగిల్‌క్లీనర్స్ పనులు చేపట్టి ముళ్లపొదలను తొలగించారు. కురవపల్లెలో డ్రైనేజిపనులకు మరమ్మత్తుపనులు చేపట్టి మురునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. మజ్జిగ వాండ్లపల్లె, కూగోటగొల్ళపల్లెలో మంచినీటి సమస్యపై వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించి ప్రజలు దాహార్తి తీర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగవేణి మాట్లాడుతూ మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, అధికారుల సహకారంతో పంచాయితీలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## మాండూస్ తుఫాన్‌తో జనజీవనం అస్థవ్యస్తం

కురబలకోట, డిసెంబర్ 10 ప్రభాతవార్త :



మాండూస్ తుఫాన్ ప్రభావంతో జనజీవనం అస్థవ్యస్తంగా మారింది. గత రెండు రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షంతో జనజీవనానికి ఇబ్బంది కలిగింది. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, మూతపడ్డాయి. ఆర్టీసి బస్సులు కొన్ని ప్రాంతాలకు పరిమితంగానే నడిచాయి, ఇండ్లనుంచి ప్రజలు రావడం లేదు. ఈ వర్షం వల్ల చెరువుల్లో, గుంతల్లోకి కొద్దిపాటి వర్షపునీరు చేరింది. టమోటా పంటకు భారీగా నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. కోతకు వచ్చిన వరిపంట దెబ్బతిని మొలకెత్తుతుందని రైతులు ఆందోళనచెందుతున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, పోలీస్, నీటిపారుదల, పశుసంవర్థక, ట్రాన్స్‌కో, గ్రామ సచివాలయ, వాలంటీర్లను అప్రమత్తం చేశామని చెరువుల పరిస్తితిపై సమాచారం అందించాలని తహశీల్దార్ భీమే శ్వర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు రాకూడదని కోరారు.

## మాండూస్ తుఫాన్‌తో వణుకుతున్న రైతాంగం

### అప్రమత్తంగా ఉండాలని సూచించిన ట్రాన్స్‌కో అధికారి

రామసముద్రం, డిసెంబర్ 10 ప్రభాతవార్త :



మాండూస్ తుఫాన్ ప్రభావంతో జనజీవనం అస్థవ్యస్తంగా మారింది. రెండు రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షంతో జనజీవనానికి ఇబ్బంది కలిగింది. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, పోలీస్, నీటిపారుదల, పశు సంవర్థక, ట్రాన్స్‌కో, గ్రామ సచివాలయ, వాలంటీర్లను అప్రమత్తం చేశామని చెరువుల పరిస్తితిపై సమాచారం అందించాలని తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, మూతపడ్డాయి. ఆర్టీసి బస్సులు కొన్ని ప్రాంతాలకు పరిమితంగానే నడిచాయి, ఇండ్లనుంచి ప్రజలు రావడం లేదు. ఈ వర్షం వల్ల చెరువుల్లో, గుంతల్లోకి కొద్దిపాటి వర్షపునీరు చేరింది. టమోటా పంటకు భారీగా నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. కోతకు వచ్చిన వరిపంట దెబ్బతిని మొలకెత్తుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు, ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెట్లకింద నిలబడకుండా వంకలు, వాగులు వద్దజాగ్రత్తగా మెలగాలని విద్యుత్ అధికారి మస్తాన్‌వల్లి తెలిపారు.

## 13న పట్టుపరిశ్రమ వ్యవస్థాపకుల నమోదు

మదనపల్లె, డిసెంబర్ 10 ప్రభాతవార్త :

పట్టుపరిశ్రమశాఖ అధికారులతో ఈనెల 13న ఉదయం 10గంటలకు వ్యవస్థాపకుల నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని పట్టుపరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు రామ్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టు రీలర్లు, ట్విస్టర్లు, పట్టుపరిశ్రమశాఖ పట్టుగూళ్ళ మార్కెట్‌నందు ఈ నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఎంఎస్‌ఎంఈ నమోదు కొరకు ఉత్సాహం ఉన్నవారు పాస్‌పోర్టుసైజ్ ఫోటో, ప్రస్తుత అడ్రస్ ప్రూఫ్ జిరాక్స్, ఆధారకార్డు, పాన్‌కార్డు, జిఎస్‌టి నెంబర్ జిరాక్స్‌లను తీసుకొని రావాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు.

## 16న విఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నిరాహారదీక్ష

మదనపల్లె, డిసెంబర్ 10 ప్రభాతవార్త :



పార్లమెంటు సమావేశాల్లో వాల్మీకుల ఎస్‌టి పునరద్దరణ విషయంపై ఈనెల 16నుంచి మూడు రోజులు పాటు విఆర్ ఎస్‌ఎస్ నాయకులు నిరాహారదీక్ష చేపట్ట నున్నట్లు జిల్లా కార్యదర్శి మార క్రిష్ణ మూర్తి, నియోజకవర్గ అధ్యక్షులు పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని లేని పక్షంలో పట్టణంలోని చిత్తూరు బస్టాండు వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి విగ్రహం వద్ద నిరా హారదీక్ష చేపడుతామన్నారు. 56ఏళ్ళుగా వాల్మీకుల ఎస్‌టి పునరుద్దరణ విష యంపై పోరాడుతున్నా ఇంత వరకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. పార్ల మెంటులో వాల్మీకుల ఎస్‌టి హోదాపై చర్చించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరాహారదీక్షల్లో విఆర్ ఎస్‌ఎస్ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో శంకర, జయసింహ, భాస్కర్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:

ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం డీడీయూజీకేవై, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ (ఎస్‌ఈఈడీఏపీ) ఆధ్వర్యంలో స్థానిక నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్ కోర్సులలో ఉచిత శిక్షన అందిస్తున్నట్లు ఆ సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజుల శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించడం జరుగుతుందని ఉపాధి కల్పించబడునన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7013665112, 9059160549 నంబరును సంప్రదించాలన్నారు.

## తుఫానుతో పెరిగిన చలి తీవ్రత

పెద్దతిప్పసముద్రం డిసెంబర్ 10, ప్రభాతవార్త



పిటిఎం మండల పరిధిలో మాండూస్ తుఫాన్ కారణంగా ప్రజలు గజ గజ వణుకుతూ తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. తెల్ల వారి జాము నుంచి ఏకధాటిగా ఒక పక్క వర్షం మరో పక్క చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే అదిరిపోయే పరిస్థితి ఏర్పడింది. గత రెండు రోజులు గా ఎడతెరిపి లేకుండా ఒకే వర్షం కురవడంతో చలి చాలా ఎక్కువగా ఏర్పడింది శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది ఈ వానలకు ప్రజలు వణికిపోతు న్నారు. ఈ వర్షం చల్లుల వల్ల నిత్యావసర వస్తువుల కోసం కొన డానికి కూడా రాలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఈ తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ఉన్న వాగులు వంకలు వర్షపు నీటితో నిండాయి గ్రామాల్లో వీధులు. రహదారులు బురదమయంగా మారాయి మరోపక్క విపరీతంగా వీస్తున్న చలి గాలులకు ప్రజలు బయటకు వెళ్లకుండా ఇండ్లల్లోనే పరిమితి అయ్యారు.

## ఆల్‌షిఫా స్థాపకులు రఫీకి సన్మానం

కడప ఏడురోడ్లు, డిసెంబరు 10, ప్రభాతవార్త:



కడప వైఎస్‌ఆర్ ఆడిటోరియంలో జరిగిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవగాహన సదస్సు ఉత్తమ సేవా పురస్కారాలు 2022 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని పలువురు ఉత్తమ సేవకులకు అవార్డులు బహూకరించిన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ప్రసన్నకుమార్ ఇతర పట్టణ ప్రముఖులచే గత 22 సంవత్సరాలుగా మానసిక వికలాంగులకు సేవలందిస్తున్న ఆల్‌షిపా వ్యవస్థాపకులు మహ్మద్ రఫీని ఘనంగా సన్మానించారు.

## మానవ సేవయే మాధవసేవ

వాల్మీకిపురం, డిసెంబరు 10 ప్రభాతవార్తః



మానవసేవే మాధవసేవ అని సమాజంలో తోటి వ్యక్తికి సహాయం అందించి ఆకలి తీర్చడం కంటే గొప్ప విషయం మరొకటి లేదని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక శ్రీషిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీసాయి నారాయణసేవా నిత్య అన్నదాన పథకానికి పీలేరు పట్టణా నికి చెందిన వీఎస్‌ఆర్ కళ్యాణ మండపం అధినేత విజయశేఖర్‌రెడ్డి రూ.1,00,116ల నగదు చెక్కును విరాళంగా అందించారు. నిత్య అన్నదాన పథకానికి ఆపన్నహస్తం అందించిన దాతను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పీలేరు వైఎస్ ఎంపీపీ ఎన్‌వి. చలపతి, కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శివానందరెడ్డి, స్టాంపుల నరసింహారెడ్డి, ఆనందరెడ్డి, కేవశరెడ్డి పాల్గొన్నారు.

## తెదేపా హయాంలో మైనారిటీలకు తీవ్ర అన్యాయం

వాల్మీకిపురం, డిసెంబరు 10 ప్రభాతవార్తః



గత తెదేపా ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరిగిందని 2017-18లో అధికారంలో ఉన్న చంద్రబాబు మైనారిటీల అభ్యున్నతి కోసం అమల్లో ఉన్న దుల్హన్, దుకాన్-మకాన్ పథకాలకు మంగళం పాడేశారని పీలేరు వైకాపా మైనారిటీ నాయకులు అబ్దుల్ కలీం ఆరోపించారు. శనివారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మైనారిటీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా పొన్నూరులో శుక్రవారం ముస్లీం మైనారిటీలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడిన మాటలు దయ్యాలు వేదాలు పలికిన చందంగా ఉన్నాయన్నారు. తెదేపా హయాంలో వక్ఫ్ ఆస్తులు అన్యా క్రాంత మయ్యాయన్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న మైనారిటీ నాయకులను చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెదేపా హాయంలో మోసపోయిన పీలేరు నియోజకవర్గంకు చెందిన ఇక్బాల్ అహ్మద్‌కు కేబినేట్ హోదాతో కూడిన రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టి మైనారిటీలకు న్యాయం చేశారన్నారు. ముస్లీంలంతా వైకాపా వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు చికెన్‌మస్తాన్, సైఫుల్లా, ఉమర్‌సాహెబ్, సమీఫుల్లా, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## వాల్మీకిపురంలో రోడ్డు ప్రమాదాలు

వాల్మీకిపురం, డిసెంబరు 10 ప్రభాతవార్తః



డిసెంబరు మాసంలో శుభకార్యాలయాలు ఎక్కువగా ఉండటంతో అనంతపురం- తిరుపతి జాతీయ రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువైంది. మాండోస్ తుఫాను కారణంగా రెండు రోజులుగా ఎడతెరపి లేని వర్షం కురుస్తుంది. ఈనేపథ్యంలో రోడ్లన్నీ నునుపుగా మారడంతో వేగంగా వస్తున్న వాహనాలన్నీ జారి ప్రమాదాలకు గురవుతున్నాయి. శనివారం ఉదయం మదనపల్లెకు చెందిన ఓ పెళ్లి బృందం కారు వాల్మీకిపురం సమీపంలో పంచముఖ ఆంజనేయస్వామివారి విగ్రహం వద్ద ఉన్న మలుపులో అతివేగంగా వస్తూ మలుపులో బ్రేకులు వేయడంతో జారుకుని బోల్తాపడింది. అయితే కారులో ప్రయాణిస్తున్న డ్రైవరు రాజు ఎటువంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు. ఇదే దారిలో అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలో మరో కారును బస్సు ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు అయిపోయింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఆర్టీసీ కండెక్టర్ నిజాయితీ

పీలేరు, డిసెంబరు 10 ప్రభాతవార్తః

స్థానిక ఆర్టీసీ కండెక్టర్ రామయ్య తనకు దొరికిన మొబైల్ ఫోన్‌ను యజమానికి అప్పగించిన సంఘటన పీలేరు బస్టాండులో చోటుచేసుకుంది. వివరాలు స్థానిక మండలంలోని ఆకులవారిపల్లెకు చెందిన డి.శివ శుక్రవారం రాత్రి భాకరాపేట నుంచి పీలేరులోని కామాటంపల్లెకు వెళుతూ ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో ఉన్న మరుగుదొడ్ల దగ్గర తన మొబైల్ ఫోను పోగొట్టుకున్నాడు. స్థానిక డిపో కండెక్టర్ రామయ్య తన విధుల్లో భాగంగా డ్యూటీ నుంచి దిగిపోతూ మూత్ర విసర్జనకు వెళ్లగా బాత్‌రూమ్ వద్ద మొబైల్‌ఫోను గుర్తించారు. శివ ఫోన్ చేయగా కండెక్టర్ రామయ్య ఫోను తన దగ్గర ఉందని వచ్చి తీసుకోవచ్చని చెప్పడంతో ఫోను యజమాని భార్య ఆంజమ్మ శనివారం ఉదయం పీలేరు ఆర్టీసీ డిపోకు వచ్చి డిపో మేనేజరు బండ్లకుమార్, కంట్రోలర్ సత్య నారాయణ, బుక్‌స్టార్ రమణ, కండెక్టర్ ప్రసాద్ సమక్షంలో కండెక్టర్ రామయ్య నిజాయితీని డిపోమేనేజరు బండ్లకుమార్ ప్రయాణికులు అభినందించారు.



దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఫ్రూట్ మర్చంట్ దంతుమియా అండ్ సన్స్ షేక్ ఖాదర్‌వలీ

## ఉపాధ్యాయ బదిలీలు ఉత్తర్వులు సవరించాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:

ఉపాధ్యాయ బదిలీల ఉత్త ర్వుల్లో ఉన్న అభ్యంతరాలు తొలగిం చాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, అలీఖాన్, చంగలరెడ్డి పేర్కొన్నారు. అకాడమిక్ సంవత్సరాలు కాకుండా బదిలీలు నిర్వహించాలన్నారు. పోస్టుల కేటాయింపునకు, బదిలీలు అర్హత సర్వీస్, రేషనలైజేషన్, పదవీ విరమణ రెండేళ్ల మినహాయింపు మొదలు అన్నింటికీ కూడా నవంబరు చివరి తేదీ అని కటాఫ్ డేట్‌గా మార్చాలని కోరారు. క్లియర్ వేకెన్సీలు 31 నవంబరు జీవోలో పేర్కొన్నట్లు కటాఫ్ డేట్ అన్నింటికీ ఒకేలా ఉండాలని కోరారు. ప్రెఫరెంషియల్ కేటగిరికీ ఎస్‌ఆర్ ఎంట్రీలు ఉంటే అనుమతించాలని కోరారు. ఎయిడెడ్ టీచర్లకు సర్వీస్ విషయంలో ఉన్న పరిమితులను తొలగించాలని వివరించారు. కేటగిరి-4ను 3 కి.మీ కంటే ఎక్కువ దూరంలో బస్సు సౌకర్యం ఉన్న ప్రాంతాలన్నీ గుర్తించాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్‌లో పేర్కొన్నట్లు ఖాళీలు ఆప్షన్ పిరియడ్ పెంచాలని కోరారు. దరఖాస్తుకు ఒకేసారి అవకాశం అన్న నిబంధనలను సవరించాలని కోరారు. జిల్లాలో గత ఎనిమిదేళ్లలో ఉపయోగించుకొన్న స్పౌజ్, ప్రెఫరెంషియల్ కేటగిరి వివరాలు ప్రకటించాలన్నారు.

## సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి : ఎంపీడీవో

పెద్దతిప్ప సముద్రం డిసెంబర్ 10, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను స్థాపించిందని వాటి ద్వారా గ్రామాల్లో ఉన్న ప్రజలకు అన్ని విధాలుగా సచివాలయ సిబ్బంది రెండు రోజులు పాటు రాత్రి వేళల్లో కూడా అందుబాటులో సచివాలయ సిబ్బంది ఉంటారని ఆయన అన్నారు. శనివారం రోజున ఎంపీడీవో గిరిధర్ రెడ్డి మండలంలోని పిటిఎం. మల్లెల. టి. సదుం అంకిరెడ్డిపల్లి. పట్టేం వాండ్ల పల్లి. కందుకూరు. గ్రామ పంచాయతీలో ఎంపీడీవో గిరిధర్ రెడ్డి సచివాలయాలకు పర్యటించారు. అనంతరం సచివాలయాల్లో జరుగుతున్న పనులను అలాగే ఫైల్స్ ను పరిశీలించారు. సచివాలయంలో పనిచేసే ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి ప్రజలకు మంచి సేవలు అందించాలని సచివా లయాల సిబ్బం ది పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. రెండు రోజులుగా ఎడ తెరిపి లేకుండా ఓ మోస్తారుగా వర్షాలు కురుస్తున్నాయని వాటికి అనుగుణంగా పిటీఎం మండలంలో ప్రతి ఒక్క సచివాలయాలంలో ఇద్దరి సిబ్బందిని ప్రత్యేకంగా రాత్రి వేళల్లో కూడా గ్రామ ప్రజలకు సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టామని అన్ని సచివాలయాల్లో రాత్రి వేళల్లో సచివాలయాల సేవలు అందించ డానికి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎంపీడీవో గిరిధర్ రెడ్డి తెలిపారు ఎంపీడీవో తోపాటు వెలుగు ఏపీఎం శివ సాంబ ఉన్నారు

## హ్యూమన్‌రైట్స్ కార్యాలయం ప్రారంభం

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 10, ప్రభాతవార్త



75వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యా లయాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కరుణాకర్ అధ్వర్యంలో కెవిఅర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రముఖ డాక్టర్ కల్లూరు ప్రదీప్ రెడ్డి పట్టణంలో వైయంఆర్ కాలనీలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యాలయాన్ని ఆయన చేతుల మీద ప్రారం భించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ ప్రజల సమస్య ల పరి ష్కారం కొరకు, బాధితులకు అండగా నిలిచి,వారి సమస్యలను లీగల్ (న్యాయ స్థానాల) ద్వారా పరిష్కారం చేయాలనే ఉద్దేశ్యంతో పట్టణంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యాలయంను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మానవత దృక్ప థంతో అభాగ్యులకు అండగా నిలుస్తూ ప్రజాస్వామ్యంలో మానవతా విలువ లతో కూడిన మంచి పేరును సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో శంకర్ యాదవ్, ప్రుద్వి తేజ్, జయరాజ్, రాజేష్, రాజు, నంగునూరు పల్లి గంగయ్య, శివ, సుధాకర్, చంద్ర, జనార్దన్,మహమ్మద్ కాసిం, అక్బర్ ఖలీల్, రామచంద్ర, రమేష్, కిషోర్, సూరి, అమీర్, అమర్, కార్తిక్, కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఒకటో తేదీ జీతాలు పొందడం ఉపాధ్యాయుల హక్కు : ఒంటేరు

ప్రొద్దుటూరుఅర్బన్, డిసెంబర్ 10, ప్రభాతవార్త

ఏపీ ఫైనాన్స్ కోడ్ ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు పొందే హక్కు ఉపాధ్యాయులకు ఉందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి , ఎపిసిపిఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎస్సార్ వెంకట జనార్ధన రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలలో పదో తేదీ కావస్తున్నా ఉపాధ్యాయులకు వేతనాలు అందకపోవడం శోచనీయమన్నారు. రుణాలు తీసుకున్నవారు ఈఎంఐలు చెల్లించడానికి, కుటుం బం గడవడానికి, వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమాజంలో ఉన్నతమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులు ఇలా వేతనాల కోసం ఎదురుచూపులు చూడడం బాధాకరమన్నారు. ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమకు రెండో ప్రాధాన్యత అని చెప్తూ విద్యాశాఖా మంత్రి చిన్నచూపు చూడడం తగదన్నారు. ప్రభుత్వ పథకాలకు , ఉద్యోగుల, పెన్షనర్ల వేతనాలకు సంబంధం లేదని, పథకాల కోసం ఉద్యోగుల వేతనాలు ఆలస్యం చేయాలని ఏ చట్టంలో ఉందని ప్రశ్నించారు. పథకాలను అమలు చేసే ఉద్యోగులకే వేతనాలు ఇవ్వకుంటే ఎలా అని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు అందజేయాలని వారు డిమాండ్ చేశారు.


## గోవులను కాపాడండి

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు 10, ప్రభాతవార్త:

రూరల్ పరిధిలోని ఉప్పరపల్లె ఆశ్రమ నిర్వాహకులు గోపాలస్వామి గోవులను కాపాడాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ గోవును పూజిస్తే సాక్షాత్తు పరదేవతకు పూజ చేసినట్లే అన్నారు. గర్భగుడిలో దేవుని విగ్రహాన్ని తాకి, మన చేతులతో అలంకరణ చేయడానికి అనుమతించరు కానీ మనం గోవుకు ఆలంకరణ చేస్తే సాక్షాత్తు పరదేవతకు అలంకరణ చేసినట్లు అన్నారు గోవులకు సేవ చేయడం వలన ఎన్నో జన్మలలోని పాపాలు నశిస్తాయి, మంచి సంతానం కలుగుతుందని సులభంగా దైవఅనుగ్రహం లభించి అష్టైశ్వర్యాలు కలుగుతాయన్నారు.

## పీసీసీ నూతన అధ్యక్షునికి సన్మానం

కడప ఏడురోడ్లు, డిసెంబరు 10, ప్రభాతవార్త:



పీసీసీ నూతన అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రుద్రమ రాజును డీసీసీ మాజీ అధ్యక్షులు షేక్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆరీఫుల్లా, జిల్లా నేతలు చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన అధ్య క్షుడి ఆద్వర్యంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేసా_మన్నారు.

## పేద వితంతు మహిళలకు ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు డిసెంబర్ 10, ప్రభాతవార్త




జమాతి ఇస్లామీ హిందీ ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అనేక సేవా కార్యక్రమాలలో భాగంగా శనివారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆర్థిక సహాయం అందించినట్లు కడప జిల్లా అధ్యక్షులు హుస్సేన్ అహ్మద్ పేర్కొన్నారు పట్టణంలోని పలు ప్రాంతాల లో పేద వితంతు మహిళలను 30 మందిని గుర్తించి ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు స్థానిక సంఘ సేవ విభాగ కార్యదర్శి చాంద్ భాషా, కమిటీ సభ్యులు వాజీద్, షఫీ ఉల్లాహ్, నాయబ్ రసూల్, ముస్తాక్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 28న ఐడియల్ యూత్ రాష్ట్ర మహాసభలు

ప్రొద్దుటూరు డిసెంబర్ 10, ప్రభాతవార్త




అల్లాపై అపారమైన విశ్వాసం పెంపొం దించే ముస్లిం యువతరాన్ని ప్రగతి మార్గం నడిపించి ఆత్మ గౌరవాన్ని నింపి ఉత్తమ జీవితం వైపు నడిపించేందుకు జనవరి 28, 29, 2023న ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఐడియల్ యూత్ రాష్ట్ర మహాసభలు నిర్వ హిస్తున్నట్లు ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షులు జబీఉల్లా పేర్కొ న్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఐడియల్ యూత్ మూవ్ మెంట్ కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని యువతను తప్పు దారిలో నడవకుండా సన్మార్గంలో నడిపించి ఆదర్శ యువతను సమాజానికి పంపే విధంగా ఐడియల్ యూత్ మూమెంట్ కృషి చేస్తుందని తెలిపారు. విజయవాడలో ఈద్గాహ్ మైదానంలో ఐడియా యూత్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలోని ముస్లిం యువకులు పాల్గొని ఒక విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనిట్ ప్రెసిడెంట్ మహ బూబ్ బాషా, జేఐహెచ్ అధ్యక్షులు మహబూబ్ షరీఫ్, సభ్యులు అబ్దుల్ ఖాదర్, బేపారి షరీఫ్ పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రాంతాల్లో అధికారుల హై అలర్ట్

తంబళ్లపల్లె, డిసెంబరు 10, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో శనివారం మాండూస్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షం కురవడం తో కుంటలు, వంకలు, వాగులు, చెక్ డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం నుంచి అధికార యంత్రాంగం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఎంపీడీవో ఆనంద్ కుమార్, మండలంలోని కొటాల, గోపిదిన్నె, ఆర్‌ఎన్.తండా, కన్నెమడుగు, ఎద్దులవారి పల్లె, ఎర్రసానిపల్లె పంచాయతీల్లో ముమ్మరంగా పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. మారు మూల గ్రామాల్లో తుఫాను కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లినా వెంటనే తన దృష్టికి తేవాలని సూచించారు. తుఫాను ప్రభావిత గ్రామాల్లో తాగునీరు కాలు ష్యం లేకుండా చూడాలని వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షంతో నిండిన చెరువులు వాటి పరిస్థితిపై ఇరిగేషన్ పంచాయతీ రాజ్ అధికారులు నిఘా ఉంచి పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వెలుగు వృద్ధాశ్రమంలో వృద్ధురాలి మృతి

### అంత్యక్రియలు నిర్వహించిన యాజమాన్యం

మదనపల్లె, డిసెంబర్ 10 ప్రభాతవార్త :



మాండూస్ తుఫాన్ ప్రభావం వల్ల వెలుగు పాఠశాలలోని వృద్ధాశ్రమంలో రుక్కమ్మాల్(70) అనే వృద్ధురాలు శని వారం మృతి చెందింది. మృతురాలిని వెలుగు స్కూల్ కార్యదర్శి ఎం.ఉదయ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అంత్యక్రియలు జరిగాయి. గత ఏడాది కాలంగా వెలుగు వృద్ధాశ్రమంలో ఆమె ఉంటోంది. ఈ నేపథ్యంలో కొద్దిగా అనారోగ్యానికి గురికావడం, తుఫాన్ ప్రభావం ఎక్కువ కావడం వల్ల మృతి చెందినట్లు వెలుగు కార్యదర్శి తెలిపారు. వృద్ధురాలు తమిళనాడులోని గుడియాతంకు చెందినది. మృతి చెందిన విషయం ఆమె కుటుంబసభ్యులకు తెలియజేసి కుటుంబసభ్యుల సమక్షంలోనే అంత్యక్రియలు నిర్వహించడం జరిగిందన్నారు. రెడ్డినాడు సంఘంకు చెందిన వైకుంఠరథంలో శవాన్ని స్మశానవాటికకు తీసుకెళ్ళి అంత్యక్రియలు నిర్వహించడం జరిగిందన్నారు.

## తుఫాన్ ప్రభావంతో కూలిన పక్కా ఇల్లు

తంబళ్లపల్లె, డిసెంబరు 10, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో మాండూస్ తుఫాను బీభత్సం సృష్టించింది. ఎడ తెరిపి లేని వర్షం కారణంగా మారుమూల గ్రామాల్లో టమోటా, పలు రకాల కూర గాయల పంటలు పూర్తిగా నీరు నిలిచి దెబ్బతిన్నాయి. బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీ అక్కమ్మగారిపల్లెకు చెంది న శివమ్మ పక్కా ఇళ్ల వర్షంతో కుప్ప కూలింది. ఇంటి లోని వస్తు సామగ్రి ధ్వంసం అయింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడం విశేషం. పూర్తిగా ఆశ్రయం కోల్పోయిన శివమ్మ కుటుం బాన్ని ఆర్థికంగా ఆదుకొని పక్కా ఇళ్ల మంజూరు చేయాల్సి ఉందని గ్రామస్థులు కోరుతున్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గోపవరం,డిసెంబర్ 10 ప్రభాతవార్త;



మండలంలో వల్లెరవారిపల్లెకు సమీపాన వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి మార్గశిర మాస మూడవ శనివారం వైభవంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు.కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమానికి పరి సర గ్రామాలనుంచి అదిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వీడియో కాల్ ద్వారా సుదూర ప్రాంతాలనుంచి రాజకియ నాయకులు, సినీ ప్రముఖులు, స్వామి కార్యక్రమాన్ని దర్శించుకొన్నారు.ఆలయ పూజారి శ్రీ పెంచలయ్య స్వామి భక్తి శ్రద్దలతో కార్యక్రమాన్ని నిర్వహించారు.చీడ పీడలలాంటి మరెన్నో ఇబ్బందులకు గురైన అభాగ్యులు శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కన్నుల పండుగదా వీక్షించి తరిస్తున్నారు.ప్రతివారం క్రమం తప్పకుండా ప్రత్యేక పూజలో ఈ దేవదేవుని దర్శించుకోవడం భక్తులకు వరంగా మారింది.కాగా ధర్మ శెట్టి ఆదిలక్ష్మ కుమారులు వెంకట సుబ్బయ్య,అశోక్,రమణ,వెంకటేష్‌లు పూజాకార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందచేసారు.కార్యక్రమంలో ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలాదారులకు మెడికల్ కిట్లు పంపిణీ

**-శబరిమలై యాత్రలో ఐక్యతాభావం చాటిన ముస్లీం సోదరులు**



గాలివీడు, డిసెంబర్ 10 ప్రభాతవార్త

శబరిమలై యాత్రకు బయలుదేరిన అయ్యప్ప మాలాధారులకు అమీన్ మెడికల్స్ వారి ఆద్వర్యంలో ప్రదమ చికిత్స కిట్లను వైఎస్సార్‌సిపి మైనార్టీ నాయకులు ఎస్.ఖాదర్, మొహద్దీన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 41 రోజులు కఠినమైన మండల దీక్షలు పూర్తి చేసుకుని 3 బస్సుల్లో శనివారం శబరిమలై యాత్రకు బయలుదేరిన అయ్యప్ప మాలాదారులకు వారి యాత్ర సవ్యంగా సాగాలంటూ ఆకాంక్షిస్తూ ఐక్యతాభావాన్ని చాటేలా ముస్లీం సోదరులు వారికి ఫస్ట్‌ఎయిడ్ కిట్లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సిపి నాయకులు నిజాముద్దీన్, సుధాకర్‌రెడ్డి, వ్యాపారవేత్త కెడెం రమాంజులు, కిరణ్, శంకర్‌నాయుడు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## సేవలతోనే తగిన గుర్తింపు

పులివెందుల, డిసెంబరు 10, ప్రభాతవార్త :




ప్రతి ఒక్కరు సమాజానికి ఉపయోగపడే సేవలు అందించడం ద్వారా తగిన గుర్తింపు పొందుతారని మానవహక్కుల పరిరక్షణ సమితి ఛైర్మన్ ప్రసన్నకుమార్ అన్నారు. మానవహక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కడపలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో శనివారం ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పులివెందులలోని విద్యాధరి హైస్కూల్ సీఈవో భానుప్రకాష్ అవార్డు అందుకున్నారు. ఈయన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులను శాస్త్ర సాంకేతిక రంగాలలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేలా చూడటం, ప్రకృతి వైపరీత్యాల కారణంగా సంభవించిన తుపాన్లలో, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టు తెగిపోయినప్పుడు అక్కడ సహాయ కార్యక్రమాలు అందించినందుకు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ విద్యాధరి విద్యా సంస్థల ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, నా స్నేహితులే ఈ అవార్డు దక్కేందుకు కారణం అని తెలిపారు.

## ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు లేవు

**మాండూస్ తీవ్రతపై తహశిల్దారు మురళీకృష్ణ**

చిట్వేలి, డిసెంబరు 10 ప్రభాతవార్త



మాండూస్ తుఫాను ప్రభావం వల్ల ప్రస్తుతానికి మండల పరిధిలో ఎలాంటి ఇబ్బందులు లేవని తహశిల్దారు మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం మొదలు ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాలైన తుమ్మకొండ, నాగవరం, అనుంపల్లె, చెర్లోపల్లె, మైలపల్లి, ఎం.రాచపల్లి, పాత చిట్వేలి, గుంజననది, గాజులవీధి తదితర చోట్ల రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించినట్లు తెలిపారు. పై గ్రామాల చెరువులన్ని సగభాగం వరకే నిండి ఉన్నాయని ఇప్పటివరకు 48 మి.మీ. మేర వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ప్రత్యేకించి చిట్వేలి గ్రామ పరిధిలోని బ్రాహ్మణవీధి, గాజులవీధి లోతట్టు ప్రాంతాల్లో కొన్ని కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు ఆయన తెలిపారు. వర్ష ప్రభావం ఆదివారం కూడా కొనసాగే అవకాశం ఉన్నందువల్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఇబ్బంది కలిగినప్పుడు అధికారుల దృష్టికి తెలియపరచాలని ఆయన కోరారు.కార్యక్రమంలో ఎంపిడిఓ పద్మభూషణ్‌రెడ్డి, ఎఎస్ఐ దామోదరం, ఆర్ఐ శేషంరాజు, తహశిల్దారు భాస్కర్, భుజంగరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జోరువానలో సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని కొనసాగుతున్న కార్మికుల నిరసనలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 10, ప్రభాతవార్త:



ఏపీఎండీసీ సంస్థ మంగంపట బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, ట్రైనింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం 12(3) అగ్రిమెంటు ప్రకారం ఫిబ్రవరి 4 నుంచి సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ముందు శనివారం జోరువానను లెక్క చేయక గొడుగులు పట్టుకొని 18వ రోజూ ఎనిరసనలు వ్యక్తం చేస్తున్నామని పోరాట కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేటలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, వారు చేస్తున్న పనిని బట్టి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం మంగంపేట బ్రాంచ్‌కు వచ్చిన కమిటీ నాయకులతో ఉదయం 9 గంటలకు చర్చిస్తారని వినతిపత్రం రూపంలో తెలియజేయడం జరిగిందన్నారు. కార్మికులకు సంస్థ అభివృద్ధికి సహకరించి భూములు ఇచ్చిన కార్మికులు చాలీ చాలని వేతనాలతో జీవిస్తున్నారన్నారు. 535 మంది కార్మికులకు 12(3) అగ్రిమెంటు ప్రకారం సక్రమంగా సమాన పనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– తహసీల్దారు శోభన్‌బాబు**

కొండాపురం, డిసెంబరు 10, ప్రభాతవార్త :

కొండాపురం మండలంలోని ముంపు గ్రామాల ప్రజలు, చిత్రావతి, పెన్నానదీ పరివాహక గ్రామాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దారు శోభన్‌బాబు అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మాండూస్ తుపాను ప్రభావంతో ఎగువ కురిసిన వర్షాలకు పెన్నానదికి 4వేల క్యూసెక్కుల వరదనీరు గండికోట ప్రాజెక్టుకు వస్తోందన్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. మాండూస్ తుపాను తీరం దాటడంతో ఆదివారం కూడా వర్షాలు కురుస్తాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి రెవెన్యూ సిబ్బందిని అలర్ట్ చేశామన్నారు. ఏదైనా సమస్య ఉంటే రెవెన్యూ సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. అలాగే ఏవైనా పాత ఇళ్లల్లో ఉన్న వారు రక్షిత ప్రదేశానికి వెళ్లాలని తెలిపారు.

## సమాన పనికి సమాన వేతనంపై ప్రభుత్వంతో చర్చిస్తాం

**– ఎండీ వెంకట రెడ్డి**

ఓబులవారిపల్లె, డిసెంబరు 10, ప్రభాతవార్త:



ఏపీఎండీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ట్రైనింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనంపై ప్రభుత్వంతో చర్చించి సమాన వేతనం ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డి అన్నారు. శనివారం మంగంపేట బ్రాంచ్‌ను ఆయన సందర్శించి ఏపీఎండీసీ మంగంపేట వారి పిలుపు మేరకు జాయింట్ యాక్షన్ కమిటీ వారితో సమాన పనికి సమాన వేతనంపై చర్చలు జరిపారు. ఈ చర్చకు రిహాబిలిటేషన్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తల్లెం వెంకట రమణారెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ తరుపున రాధాకృష్ణ, మురళీ, వైఎస్ఆర్ యూనియన్ తరుపు సాల్మన్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మేనేజ్‌మెంట్ సమాన పనికి సమాన వేతనం ఎంటీఏ-1, ఎంటీ ఎ-1 తీసివేస్తూ కార్మికులు ఎక్కడైతే పని చేస్తున్నారో అక్కడ వారి డిజిగ్నేషన్ బట్టి అవి తగ్గకుండా వేతనాలు ఇస్తూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన విధంగా తగు పద్ధతులు అనుసరించి ఈనెల 22 లోపు చర్చలు జరిపి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో రిహాబిలేషన్ యూనియన్ ప్రెసిడెంట్ సగినాల సుబ్రమణ్యం, బాలకృష్ణ, వసంత, లక్ష్మి, నారాయణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యవసాయాధికారి 5 రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు

జమ్మలమడుగు, డిసెంబరు 10, ప్రభాతవార్త:



జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ, పురుగుల మందుల నియంత్రణ చట్టం 1968 అమలు నిర్వహణ మరియు క్వాలిటీ కంట్రోల్ అధికారి విధులు, బాధ్యతలు అమలు చేసే విధానాల గురించి నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో ఐదు రోజుల పాటు శిక్షణలో పాల్గొని పూర్తి చేసుకొని అవగాహన పొందించినట్లు ముద్దనూరు మండల వ్యవసా యాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. శిక్షణ ముగింపులో భాగంగా ఎన్ఐపీహెచ్ఎం డైరెక్టర్ జనరల్ సాగర్ హనుమాన్ సింగ్ చేతుల మీదుగా శిక్షణ ధృవపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తాము పనిచేసే చోట అమలు పరిచి రైతులకు అందుబాటులో ఉంచి నాణ్యమైన సేవలు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐపీహెచ్ఎం అధ్యాపక బృందం శ్రీదేవి, బేబీ రాణి, జయదేవి, ఓంపాల్ సింగ్, ఏపీ, తెలంగాణ, కేరళ చత్తీష్‌ఘడ్, పంజాబ్ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థలపై నిషేధం

**– జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్**

కడప క్రైం, డిసెంబరు 10, ప్రభాతవార్త:




చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కొన్ని సంస్థలను నిషేధిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల సంస్థలుగా కేంద్రం గుర్తిస్తూ కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు, రిహాబ్ ఇండియా ఫౌండేషన్ రిహాబ్ ఇండియా ఫౌండేషన్ కేరళ వంటి సంస్థలను చట్టవిరుద్ధ కార్యకలాపాల సంస్థలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అన్ లాఫుల్ యాక్టివిటీ, ప్రివెన్షన్ యాక్ట్ 1967 ప్రకారం కేంద్ర ప్రభుత్వం 27 సెప్టెంబరు 2022 నిషేధం విధించిందని, ఇటువంటి సంస్థల కార్యకలాపాలు ఎవరైనా నిర్వహించినా, ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.

## అపహరించిన అంబేద్కర్ విగ్రహాన్ని మాకు అప్పజెప్పండి

**– ప్రజా సంఘాల జెఏసి డిమాండ్**

రాయచోటి రూరల్, డిసెంబర్ 10ప్రభాతవార్త:



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 66వ వర్ధంతి సందర్భంగా ఈనెల 7న అర్ధరాత్రి అపహరించిన అ ంబేద్కర్ విగ్రహాన్ని తమకు అప్పజెప్పాలని అన్నమయ్య జిల్లా ప్రజా సంఘాల జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జోరుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లక్కచేయకుండా ప్రజా సంఘాల నేతలు అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలో ఏర్పాటు చేసిన నిరాహార దీక్ష శిబిరంలో విలేకరులతో మాటా్లాడారు. రాయచోటి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహాన్ని అర్ధరాత్రి సమయంలో తొలగించిన తర్వాత ఎమ్మెల్యే ఆదేశాలతోనే రెవెన్యూ అధికారులు ధ్వంసం చేసినట్లు ప్రజా సంఘాల నాయకులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జెఏసి నాయకులు ఈశ్వర్, రామాంజనేయులు, రెడ్డెయ్య, తాతయ్య, రవిశంకర్, నాగార్జున, రామా శ్రీనివాసులు, అక్బర్ అలీ, సుజాత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, కాల్వలు

**– పరిశీలించిన ఎమ్మెల్యే కొరముట్ల**

ఓబులవారిపల్లె, డిసెంబరు 10, ప్రభాతవార్త:



బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో గత 2 రోజులుగా మాండూస్ తుఫాన్ వల్ల రైల్వేకోడూరు నియోజకవర్గంలో అతి భారీ వర్షాలు కురవడంతో పలుచోట్ల వాగులు, వంకలు పొంగి రోడ్లు, అరటి పంటలు దెబ్బతిన్నాయి. శుక్రవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితర అధికారులు పండ్ల తోటలు, వాగులు, వంకలను పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచనలిచ్చి పలు ప్రాంతాలను పరిశీలించారు. దెబ్బతిన్న పండ్ల తోటలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాండూస్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 10, ప్రభాతవార్త:



మాండూస్ తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మూడు రోజులుగా రాష్ట్రమంతా కురుస్తున్న తుఫాన్ వల్ల మాడి రైతులు వేరుసెనగ, టమోటా ఇతర పంటలు వర్షానికి మునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరాకు రూ.10లక్షలు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. రబీ సీజన్‌లో వేరుసెనగ ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేవారని, ఈ వర్షానికి పంటల పూర్తిగా దెబ్బతిన్నాయని పూర్తిగా రెవెన్యూ అధికారులతో సర్వే చేసి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలన్నారు. గతేడాది తుఫాన్ వల్ల దెబ్బతిన్న రైతులకు ఇంకా ఆర్థిక సహాయం అందడం లేదని ప్రభుత్వం ఈ ఏడాది మానస్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు అన్నదానం

కడప కార్పొరేషన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:



పేదలకు, నిరాశ్రయులకు, అవసర మైన వారికి మా సంస్థ తరుపున అమ్మ ముద్ద కార్యక్రమం ద్వారా అన్నదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర ఛైర్మన్ వెన్నపూస రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం కడప పాత రిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణలో భాగంగా అన్న దానంతో పాటు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్ క్యాంప్‌లను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నదాన కార్యక్రమంలో ఎన్‌హెచ్ ఆర్‌సీ రాయలసీమ డివిజన్ అధ్యక్షులు మస్తాన్ బాషా, డివిజన్ జనరల్ సెక్రటరీ విజయభాస్కర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు విజయభాస్కర్ రాజు, మహిళా అధ్యక్షురాలు విమల, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 33వ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం

కడప ఏడురోడ్లు, డిసెంబరు 10, ప్రభాతవార్త:

గతంలో 33వ డివిజన్ వర్షం కురిసి నప్పుడు గల్లీలన్నీ వర్షం నీటితో మురుగు కాలువలు నీరు కలిసి పారుతూ దుర్వాసన వెదజల్లుతుండేవి. గౌస్‌బాషా (చాక్లెట్) కార్పొరేటర్ అయినప్పటి నుంచి డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మేయర్ సురేష్‌బాబు దృష్టికి రోడ్లు, మురుగు కాలువల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించడంతో చొరవ చూపారు. ప్రస్తుతం ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా నీరు నిల్వ లేకపోవడంతో ప్రజలు, కార్పొరేటర్ గౌస్ బాషాను అభినందించారు.

## జలాశయాలను పరిశీలించిన పోలీస్ యంత్రాంగం

రాయచోటి.డిసెంబర్ 10 ప్రభాతవార్త



రాయచోటి నియోజకవర్గం లోని పలు జలాశయాలను మాం డూస్ తుఫాన్ కారణంగా ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా శనివారం కంచాలమ్మ గండి, పగడాల కుంట, గౌరమ్మ బుగ్గ వద్ద నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించిన మున్సిపల్, పోలీస్ అధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఎస్పీ ఆదేశాల మేరకు నిన్న ఉదయం నుంచే అ ప్రమత్తంగా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. వర్షాలు కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని, వర్షం తీవ్రతపై ప్రతి గంటకు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమీషనర్ రాంబాబు, చైర్మన్ ఫయాజ్ బాష ఆద్వర్యంలో రోడ్లపై వర్షం నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు జెసిబీ ద్వారా మురుగు కాలువల్లో చెత్త మట్టి తొలగిస్తున్న సిబ్బంది. తహశీల్దార్ రవిశంకర్‌రెడ్డి, అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి ఆద్వ ర్యంలో కుంటలు, చెరువులను పరిశీలించి ప్రజలకు అవగాహన కలిగిస్తూ కుం టలు, చెరువులు వద్దకు వెళ్లవద్దని సూచనలు చేసిన ఎస్ఐ నరసింహారెడ్డి, ము న్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మల్లిఖార్జున ఎఎస్ఐ సర్దార్ విద్యుత్ అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు అన్ని ముందస్తు చర్యలు ఎపిఎస్‌డిసిఎల్ అధికారులు చేపట్టారు.

## మునక ప్రాంతాల ప్రజలను ఆదుకొంటాం : పంతగాని

రైల్వేకోడూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త 3



రైల్వేకోడూరు మండలంలోని మునక ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకొంటామని రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ నాయకులు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. శనివారం సాయంత్రం రైల్వేకోడూరు పట్టణంలోని గుంజనేరు, ధర్మాపురం తదితర ప్రాంతాల్లో ఆయన సంబంధిత బాధితులను పరామర్శించారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బాధితులకు చేయూతనిచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు రైల్వేకోడూరు ప్రాంతంలో పర్యటించి వరద బాధితులకు న్యాయం చేసేందుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, కూని చంద్రయ్య, సూర్యప్రకాష్ నాయుడు, కస్తూరి దినేష్‌నాయుడు, కూని చంద్రయ్య, దాసరి చంద్ర, హరి, మండ్ల అమర్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష నూతన కార్యాలయం ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:




నూతన హంగులతో ఏర్పాటు చేసిన జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ప్రారంభిం చారు. కలెక్టర్‌తో పాటు జేసీ సాయికాంత్ వర్మ కడప నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ (ఐఎఎస్), శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా ఏఐఎస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు నూతన హంగులతో అధునాతన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు నూతన హంగులతో అధు నాతన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అర్జీదారులను మర్యాద పూర్వకంగా చూసుకొని ప్రతి ప్రభుత్వ కార్యాల యం ఆధునిక దేవాలయాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాన్ని నూతన హంగులతో అన్ని రకాల వసతులు కల్పించిన జిల్లా సమగ్రశిక్ష పథక వసతులు కల్పించిన జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డా.అంబ వరం ప్రభాకర్‌రెడ్డిని కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్‌వర్మలు అభినందించారు. కార్యక్రమంలో డీఈవో దేవరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డా.వెంకట సుబ్బయ్య, బద్దెన కళాపీఠం అధ్యక్షులు గంగసాని సాంబశివారెడ్డి, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

# మైనర్ల చేతుల్లో దూసుకుపోతున్న బైక్స్

**–ఇబ్బందులు పడుతున్న వాహనదారులు –ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరు?**

రాయచోటి టౌన్.డిసెంబర్ 10 ప్రభాతవార్త





రాయచోటి పట్టణంలో రోజు రోజుకు సిటీ కల్చర్ పెరుగుతూ క్రమశిక్షణ తప్పి పిల్లల మొండి వైఖరి కోరలు చాస్తున్నది. గత కొన్ని రోజులుగా విద్యార్థులు క్రమశిక్షణ రాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. తల్లిదండ్రులకు సంబందించిన వాహనాలను పిల్లలు (మైనర్లు) ఇష్టం వచ్చినట్లుగా రోడ్లపైన అతి ప్రమాదకరంగా ముఖ్యంగా ప్రధాన కూడలిలో సైతం రయ్.. రయ్ మంటూ మైనర్లు డ్రైవింగ్ చేయడంతో ప్రజలు చాలా వరకు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజలే కాదు వాళ్ల తల్లిదండ్రులు కూడా అపారమైన నష్టాన్ని సరిచూస్తున్నారు. మదనపల్లి రోడ్ కొత్తపేట రోడ్ ప్రాంతాలలో స్కూల్స్ అధికంగా ఉన్నాయి. ఈ మైనర్‌లు పాఠశాలలకు వెళ్లేటప్పుడు పాఠశాలలు వదిలినప్పుడు బైక్‌లను ఇష్టానుసారంగా నడపడం జరుగుతున్నది. దీనివల్ల ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయి.

### మైనర్‌లకు వాహనాలు ఇస్తే....

పిల్లలు మారం చేస్తున్నారని లేక సరదా కోసమో మైనర్‌లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు భారీ మూల్యం చెల్లించక తప్పదు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం ద్వారా మొట్టమొదటిగా వాహనానికి సంబందించిన యజమానులే చట్టరిత్యా శిక్షార్హులు. భారత వయస్సు చట్టం 1875 సెక్షన్ 3 ప్రకారం 18 సంవత్సరాలు నిండని వారిని మైనర్‌లుగా పరిగణిస్తారు. నూతన వాహనాల చట్టం ప్రకారం మైనర్లు వాహనం నడిపితే వాహనం ఇచ్చిన వారికి మైనర్‌ల యొక్క తల్లిదండ్రులకు మూడేళ్ల జైలు శిక్ష లేదా 25 వేల రూపాయలు జరిమానా విధించే విధంగా ప్రభుత్వం చట్టాన్ని రూపకల్పన చేసింది.

### చట్టాలు ఏం చేస్తున్నాయి....

కేంద్ర ప్రభుత్వం సెప్టంబర్ 1వ తేదీ నుంచి నూతన వాహనాల చట్టాన్ని దశలవారిగా అమలు చేస్తుంది. ఈ చట్టం ప్రధానంగా ఏమి వివరిస్తుందంటే మైనర్‌ల ద్వారా ప్రమాదం వాటిల్లితే తక్షణమే వాహనాన్ని సీజ్ చేసి వాహనదారుడు పైన తల్లిదండ్రుల పైనా చట్టరిత్యా చర్యలతో పాటు భారీగా జరిమానా కూడా విధిస్తున్నారు.

### నూతన నిబంధనలు ఎలా ఉన్నాయి....

మైనర్‌లు వాహనం నడిపితే 25 వేల రూపాయలు ఓవర్ లోడ్ 20వేల రూపాయలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పట్టుబడితే 10వేల రూపాయలు, ఫిట్నెస్ లేని వాహనం నడిపితే 10వేల రూపాయలు, అంబులెన్స్‌కు దారి ఇవ్వక పోతే 10వేల రూపాయలు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తే, రాంగ్ రూట్ ఓవర్ టేకింగ్, త్రిబుల్ డ్రైవింగ్, రేస్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా ఉంటే 5వేల రూపాయలు, అతివేగానికి 2వేల రూపాయలు, హెల్మెట్ ధరించకపోతే వెయ్యి రూపాయలు, సీట్‌బెల్ట్ ధరించకపోతే 1000 రూపాయలు జరిమానా విధించే విధంగా చట్టాలు అమలులోకి వచ్చాయి.

### మైనర్‌లకు ముఖ్యంగా సరైన నడవడికతో కూడిన సంస్కృతి నేర్పించాలి :

**ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు**

మైనర్‌లకు ఇవా ్వల్సింది సరైన నడవడికతో కూడిన సంస్కృతి తప్ప చేతికి నడుపమని వాహనం ఇచ్చి వారి జీవితాన్ని శిక్షించరాదు. అతివేగం వల్ల సరదాగా ఉంటుంది కావచ్చు కాని అతివేగం వల్ల వాహనం కంట్రోల్ కాక అనుకోని విధంగా ఏదైనా రోడ్డు ప్రమాదం వాటిల్లితే ఒక్కరు మాత్రమే కాదు వారిని నమ్ముకున్న కుటుంబం కూడా రోడ్డుపాలవుతాయని కావునా అందరూ వేగంకంటే సురక్షితంగా గమ్యం చేరుకునేందుకు ప్రయత్నించాలి. సరదా కోసమో ఆకతాయిగానో మైనర్‌లకు వాహనం ఇస్తే ఖచ్చితంగా వారిపైన తల్లిదండ్రులు పైనా కేసు నమోదు చేసి న్యాయ స్థానంలో ప్రవేశబెట్టడం జరుగుతుందని రాయచోటి పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు.